క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు



ప్రకాష్‌గౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శంషాబాద్: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జన్మదిన వేడుకలను శంషాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా జరిపారు. పార్టీ నేతలు మల్లికా గార్డెన్ నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రకాశ్‌గౌడ్ ఇంటి వద్ద ఆయనను భారీ గజమాలతో సన్మానించి కేక్‌కట్ చేయించారు. కార్యక్రమంలో నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేశ్‌గౌడ్, జెడ్పీటీసీ తన్వీ, ఎంపీపీ జయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఆర్.గణేష్‌గుప్తా, కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు: సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని గాలిగూడకు చెందిన బాలమణి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. నిరుపేద కుటుంబం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించగా సీఎం సహాయనిధి నుంచి రూ. 1.90 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం బాధిత మహిళకు ఆయన చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాములు, నర్సింగ్ రావు, వెంకటేశ్, నర్సింలు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి



కేశంపేట: కరెంట్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. కేశంపేటకు చెందిన రైతు బండ రాములు పాడిపరిశ్రమపైన ఆధారపడి జీవిస్తున్నాడు. గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు కిందికి ఉండడంతో మేతకు వెళ్లిన గేదె విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుర్మిద్దలో శాంతిహోమం


యాచారం: కుర్మిద్దలో శుక్రవారం శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. పురాతన సత్యనారాయణస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించనున్న నేపథ్యంలో ఆ భవనం కూల్చివేతకు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పూజారి రాజేశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో శాంతిహోమం చేసి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం ఆలయాన్ని కూల్చి వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: విఠాయిపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం డా.పరిక్షిత్ నరేందర్, మంజులదేవిల ఆధ్వర్యంలో 181 మందికి కంటి పరీక్ష చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత, ఆస్పత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ తదితరులు

తలకొండపల్లి: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ నిర్మాణం పూర్తయింది. శుక్రవారం జెడ్పీటీసీ ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభం, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక, పోస్టర్‌ను జెడ్పీటీసీతో కలిసి ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, యాదయ్య, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బీమా ఇస్తుందా ధీమా!

పథకం అమలుపై మిశ్రమ స్పందన

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38 వేల మంది గీతకార్మికులు
- పలువురి హర్షం
- రైతుబంధులా గీతబంధు ఉండాలని డిమాండ్



బొబ్బిలిగామలో ఈత చెట్టును తీస్తున్న కార్మికుడు యాదయ్య

షాబాద్: విధి నిర్వహణలో చనిపోయిన గీతకార్మికుడికి పది రోజుల్లో రూ.5లక్షల బీమా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయాలని సీఎం కేసీఆర్ ప్రకటనపై గీతకార్మికుల్లో మిశ్రమ స్పందన వస్తోంది. చెట్టుపైనుంచి పడిన కార్మికులకు సీఎం కేసీఆర్ బీమా ఇవ్వడంపై సానుకూలంగా ఉన్నట్లు అధికారికంగా చెప్పడంతో పలువురు కార్మికులతో పాటు గౌడ్ సంఘం నాయకులు కొంత మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది సాధారణ మరణాలకు సైతం బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు 38 వేల మంది గీతా కార్మికులు ఉన్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందని వారు మరో 9 వేల మంది వరకు ఉండొచ్చని అంచనా. ప్రభుత్వం ప్రకటించినట్లుగా కాకుండా రైతు బీమాలో ఉన్నట్లు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తించేలా నిబంధనలు సవరించినప్పుడే సరైన ఫలితం దక్కుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి వృత్తికి దూరమయ్యే పరిస్థితులు ఏర్పడినప్పుడు అనుసరించాల్సిన నిబంధనలతో పాటు ఆర్థిక సహాయంపై మరింతగా క్లారిటీ రావాలని చెబుతున్నారు. ప్రభుత్వం విధి విధానాలను ఇంకా ఖరారు చేయాల్సి ఉండడంతో కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.10 లక్షల బీమా వర్తింపజేయాలి



దినదిన గండంగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న కార్మికులకు రూ. 10లక్షల మేర బీమా వర్తించేలా చట్టాన్ని అమలు చేయాలి. సాధారణ మరణాల తో పాటు గాయపడిన వ్యక్తులకు బీమా అందించేలా నిర్ణయం తీసుకోవాలి.

–నక్క శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర గీతా కార్మికుల సంఘం నాయకుడు

ఎన్నికల నినాదంగా మారకూడదు



సీఎం కేసీఆర్ ప్రకటన ఎన్నికల హామీలాగా కాకుండా గీతా కార్మికుల ప్రయోజనాలకే పెద్దపీట వేసేలా విధి విధానాలను ప్రభుత్వం తయారు చేసి అమలు చేయాలి. రైతుబంధుకు ఉన్న బీమా ప్రయోజనాలు అన్ని తప్పనిసరిగా గీత కార్మికులకు వర్తింపజేయాలి.

–గడిగె గజేందర్‌గౌడ్, జిల్లా గీతా కార్మికుల సంఘం నాయకుడు

గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ఇవ్వాలి



రైతుబంధు మాదిరిగా గుర్తింపు కార్డు ఉన్న ప్రతి గౌడ కులస్తుడికి గీతన్న బీమా వర్తింపజేయాలి. చనిపోయిన, శాశ్వత దివ్యాంగుడైన రూ. 5లక్షల పరిహారం మంజూరు చేయాలి. పింఛన్ పొందుతున్న వృద్ధులకు సైతం పరిహారం ఇవ్వాలనే నిబంధన చేర్చాలి.

–వెంకటయ్య, గీతా కార్మికుడు, పోతుగల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు క్షేమం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

కొత్తూరు: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా ఆశలు అవగాహన కల్పించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జయలక్ష్మి పేర్కొన్నారు. మండల ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఆశ 'డే' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశవర్కర్లు తమ పరిధి కేంద్రాల్లో ఉన్న గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బలహీనంగా, హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి వైద్యుల సూచన మేరకు పరీక్షలు, చికిత్సలు చేయించాలన్నారు. సంవత్సరం లోపు చిన్నారులకు బుధ, శనివారం గ్రామాల్లోని ఆరోగ్యకేంద్రాల్లో టీకాలు వేయించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆస్పత్రి వైద్యుడు హరికిషన్, ఆయూష్, వైద్యుడు రాజ్‌మోహన్, సీహెచ్‌ఓ చిట్టిబాబు, హెల్త్‌సూపర్‌వైజర్ రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ శివకుమార్, ఆశలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో విశ్వాసంగా ఉంటాం

పీసీసీ కార్యదర్శి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

షాద్‌నగర్: తాము ఎల్లప్పుడు ప్రజలతో విశ్వాసంగా ఉంటామని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమాలపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతలు కుక్కల్లా మొరుగుతున్నారంటూ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తమను కించపరిచేలా మాట్లాడారని, ఇలా మాట్లాడడం సరికాదన్నారు. బీరు, బిర్యానీలకు అమ్ముడుపోయే నేతలకు కాలం చెల్లిందన్నారు. గత ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని చెప్పిన బీఆర్‌ఎస్ నేతల మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి కనీసం సర్వే పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. అలాగే, నిరుద్యోగ భృతి, దళితులకు భూ పంపిణీ హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, జంగ నర్సింహ్మా, రాజు, శేఖర్, రవికుమార్‌గుప్తా, సుదర్శన్, కొమ్ముకృష్ణ, సీతారాం, చంద్రపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో ప్రయోజనం

జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపులు దోహదపడతాయని జనవిజ్ఞాన వేదిక(జేవీవీ)రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపును వెంకటరమణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించడం, శోధించడం ద్వారా విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతుందన్నారు. సమ్మర్ క్యాంపులో చదువు, ఆట, పాటలతో పాటు భౌతిక, రసాయన, జీవశాస్త్ర అంశాలలో ప్రయోగాలను చేస్తూ నేర్చుకోవడం జరుగుతుందన్నారు. డ్రాయింగ్, చెస్, మెడిటేషన్, యోగా, మ్యాజిక్, ఓరిగామి తరగతులను నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మన పరిసరాల్లో జరిగే ప్రతి అంశంపై ప్రశ్నించాలని, చదువును శాస్త్రీయ దృక్పథంతో చదివితే మంచి మార్కులను సాధించడంతో పాటుగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ క్యాంపు ఈ నెల 20 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ డివిజన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌బండారి, అధ్యక్షుడు కుర్మయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌రజాక్, విజ్ఞాన్ కళాశాల కరస్పాండెంట్ విశ్వనాథం, ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలను సహించం

జెడ్పీవైస్ చైర్మన్ గణేష్



మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ గణేష్

కొత్తూరు: ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్‌ను ఉద్దేశించి జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. దీనిని జీర్ణించుకోలేక శంకర్ ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. శంకర్ నాయకత్వం నచ్చకే కాంగ్రెస్‌ను వీడుతున్నారని ఆరోపించారు. శంకర్ వ్యక్తిగత ఆరోపణలు, దూషణలు మానుకోవాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్, జోలీ రవీందర్, కోస్గి శ్రీనివాస్, యాదగిరి, రమేష్, జంగయ్య, లక్ష్మయ్య, నర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్లలో 'ఇంటింటికి సీపీఐ సభ'

చేవెళ్ల: 'ఇంటింటికి సీపీఐ' ముగింపు సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గం సభ్యులు కె.రామస్వామి కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సీపీఐ ఆధ్వర్యంలో గత నెల 14వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు జరిగిన 'మోడీ హటావో దేశ్‌కో బచావో' అనే నినాదంతో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 155 గ్రామాలకు ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా మోడీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలు, మోసాలను ప్రజలకు తెలియజేసినట్లు చెప్పారు. ముగింపు సభను చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, జిల్లా కమిటీ నాయకులు హాజరవుతారని చెప్పారు.

నేడు జాబ్‌మేళా

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో శనివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడానికి వివిధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని ఈ మేళా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మా సమస్యలు పరిష్కరించండి



వీఓఏలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చేవెళ్ల: వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం వద్ద శుక్రవారం 17వ రోజు సమ్మె కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ.. ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, 10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో డ్వాక్రా సంఘాల పనితీరు, వారి నిర్వహణ మొత్తం ఆన్‌లైన్‌లో ఎంట్రీలు వీఓఏలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. చిరు ఉద్యోగులైన వీఓఏల సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వీఓఏల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షురాలిగా టి.కవిత, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సలహాదారులుగా చంద్రశేఖర్, కోశాధికారిగా ప్రమీల, ఉపాధ్యక్షుడిగా వినోద్, జ్యోతి, సునీత, సహాయ కార్యదర్శులుగా రమేశ్, స్వరూప, రాములు ఎన్నికైయ్యారు.

8న ఐటీఐ అప్రెంటిషిప్ మేళా

షాద్‌నగర్: మండలంలోని లింగారెడ్డిగూడలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సంబంధిత విద్యా అర్హత ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని, వెనుకబడ్డ ఈ ప్రాంత ప్రజలు బాగుపడుతారని సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చిందని తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రియాంక సభను సక్సెస్ చేయాలి

నిరుద్యోగుల సమస్యపై ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ప్రియాంక గాంధీ బహిరంగసభకు, నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు సంజీవ, నేతలు శేఖర్‌గౌడ్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



కడ్తాల్: సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేతలు

కడ్తాల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీపీఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కందుకూర్, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లిలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రంలో జేపీఎస్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. టీపీఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జావిద్, జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, యాదయ్యగౌడ్, యాదయ్య, కృష్ణ, జేపీఎస్ నాయకులు శివకుమార్, మరళీమోహన్, వాజిద్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సమస్యలు పరిష్కరించాలంటూ జేపీఎస్‌లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ తమను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న వేదపండితులు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తట్టిఅన్నారం లలిత భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. వేలాది భక్తజనం సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. ఆలయంలో అష్టాదశ శక్తి పీఠాల అమ్మవార్లను ప్రతిష్ఠింప చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, క్యామ మల్లేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యే పూజలు చేశారు.

సమస్యల పరిష్కారానికే బస్తీబాట

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికే బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 10, 27 వార్డుల్లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డు పరిధి కాలనీల్లో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. సీసీరోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, వంటి తదితర అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, కమిషనర్ వెంకన్న, విశ్వం, కౌసల్య, శంకర్, జమృద్‌ఖాన్, శేఖర్, నర్సింహ్మా, సర్వర్‌పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తూరు: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పెంజర్ల అనంతపద్మనాభ స్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాలు హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. భక్తి గీతాల ఆలాపన, భజనలు వంటి కార్యక్రమాలతో ప్రజల మధ్యన భక్తి, స్నేహభావం పెరుగుతుందని చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

సంప్రదాయాలను మరవొద్దు

కొందుర్గు: సంస్కృతి, సంప్రదాయాలను మరవొద్దని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..నాభిశిల ప్రతిష్ఠాపన గ్రామానికి శుభసూచకమని చెప్పారు. ఆధ్యాత్మిక భావాలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. అలాగే, రేగడిచిల్కమర్రిలో మైసమ్మ దేవత విగ్రహం ప్రతిష్ఠాపన చేశారు. అమ్మవారికి పూజలు నిర్వహించి, బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు.